

విద్య,వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - పెద్దాపురం

రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. చదలవాడలో శుక్రవారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ ఒబిలి శెట్టి పెద్దకాపు అధ్యక్షతన జరిగిన సభలో 18 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు,గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ నియామక పత్రాలను పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ, రాజమండ్రి గౌతమి నేత్రాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, ఏపీవో స్వామి, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, ఎంపీటీసీలు శైల గణేష్, కుంచె బుచ్చిరాజు, వాసిరెడ్డి శ్రీనివాస్, గవరసాన ఏసుబాబు, కోడిగుడ్డు అన్నపూర్ణ, వేమన దత్తుడు, ఒబ్బిలి శెట్టి కాశీ, రాజబాబు, సాయి పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు.

ప్రి పెయిడ్ మీటర్ల నిర్ణయంపై సిపిఎం నిరసన

-వెనక్కి తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - సామర్లకోట

విద్యుత్ ప్రీపెయిడ్ మీటర్ల నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కరణం ప్రసాదరావు మాట్లాడుతూ గడచిన సంవత్సరం లోటు బడ్జెట్ పేరుతో 12 వేల 792 కోట్ల రూపాయలును ప్రభుత్వమే భరించాలని అన్నారు. రాష్ట్రం లోని వినియోగదారులకు నివాస గృహాలకు వ్యాపార సంస్థలన్నింటికి 2025 నాటికి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టాలని ప్రతిపాదించిన వినియోగదారులపై 13వేల 252 కోట్ల భారం ప్రజలపై మోపడం దారుణమని అన్నారు. చంద్రబాబు నాయుడు మళ్ళీ వస్తే ప్రజలందరిపై బాదుడే బాదుడు అని చెప్పుకుంటూ వచ్చి అధికారం చేయించుకున్న జగన్మోహన్ రెడ్డి నేడు ప్రజల పైన అంతకు మించిన భారాలతో బాదే బాదుడు కార్యక్రమం నిర్వహిస్తున్నారని అన్నారు. వినియోగదారులకు ప్రయోజనం లేని ఈ భారాన్ని మోపడం సరైనది కాదని ఈ విధంగా చేస్తే రాబోయే రోజుల్లో జగన్మోహన్ రెడ్డికి గతంలోచంద్రబాబుకు పట్టిన గతే పడుతుందని అన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో రూ.26 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. ప్రస్తుతం పోస్ట్ పెయిడ్ పద్ధతికి భిన్నంగా ప్రీపెయిడ్ పద్ధతి ప్రజలపై తీవ్ర భారం మోగుతుందన్నారు. తక్షణం పేదలపై మోపే విద్యుత్ ఛార్జీల భారాన్ని విరమించు కోవాలని అన్నారు. లేకుంటే ప్రజలందరిని కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి బాలం శ్రీనివాస నాయకులు దారబాని కృష్ణ, కొత్తూరి తులసీదాస్, బాలం చరణ్ సిహెచ్ మహేష్, పారి నాయుడు పాల్గొన్నారు.

ఆర్‌టిఒ కార్యాలయం వద్ద ధర్నా

-పెంచిన రోడ్ టాక్స్ ఉపసంహరించుకోవాలి
-ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
-ఆలిండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్, సిఐటియు డిమాండ్



పెంచిన రోడ్ టాక్స్ తగ్గించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రాష్ట్ర ప్రభుత్వం రవాణా వాహనాలపై భారీగా పెంచిన రోడ్ ట్యాక్స్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కాకినాడ రవాణా శాఖ కార్యాలయం వద్ద ఆలిండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం ఆర్‌టిఒ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషబాబ్జీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం చాలా అన్యాయమని, ఇప్పటికే స్పేర్ పార్ట్‌ల ధరలు పెరిగాయని, దానికి తోడు పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. భారాలతో జీవనం సాగిస్తున్న ట్రాన్స్ పోర్ట్ వాహనదారులపై మరిన్ని భారాలు మోపడం తగదని, వెంటనే ప్రభుత్వ నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.టాటా మ్యాజిక్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు వాలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన చలానాలు, ఇన్స్యూరెన్స్, ప్రైవేటు ఫైనాన్స్‌లను తట్టుకోలేక కుటుంబ జీవనానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కరోనా సమయంలో ప్రకటించిన మారటోరియం కూడా తమకు ఉపయోగపడలేదని తెలిపారు. ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.శ్రీ లక్ష్మీ గణపతి ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మరుకుర్తి నాగబాబు మాట్లాడుతూ ప్రభుత్వం మీద ఆధార పడకుండా ఉపాధి పొందుతూ ప్రభుత్వానికి ఆదాయం సమకూరుస్తూ జీవనం సాగిస్తున్న తమపై ఇంతదారుణంగా భారాలు వేయడం తగదన్నారు. గతంలో 1500 నుండి 2000 గా ఉన్న గ్రీన్ టాక్స్ 8 నుండి 10 వేల వరకు వసూలు చేస్తున్నారని, ఆ సొమ్ము ఏమిచేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, దీనివల్ల వాహనాలు తరచూ రిపేర్లకు గురవుతున్నాయని తెలిపారు. అనం తరం రవాణా శాఖ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జగన్నాధరాజు కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టాటా మ్యాజిక్ యూనియన్ నాయకులు వాలిశెట్టి శ్రీనివాస్, భాషా, మూర్తి, వీరు, శేఖర్, ప్రసాద్, తాతాజీ, రామరాజు, సత్యనారాయణ, నగేష్, నాగేశ్వరరావు, రాజేష్, శ్రీవాస్ లతో పాటు సిఐటియు నగర అధ్యక్షులు పలివెల వీరబాబు, జిల్లా కోశాధికారి మలక వెంకట రమణ, నాయకులు మేడిశెట్టి వెంకట రమణలు పాల్గొన్నారు. నగర పాలక సంస్థ క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఎం.శివశంకర్, టి. గంగాధర్‌లు సంఘీభావం తెలిపారు.

పరిశుభ్రత పాటించకపోతే కఠిన చర్యలు

- మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - కోటనందూరు

తుని పట్టణంలో వ్యాపారాల సాగిస్తున్న వర్తకులు అందరూ పరిశుభ్రత పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తుని మున్సిపల్ కమిషనర్ బి.జె .ఎస్ .ప్రసాదరాజు హెచ్చరించారు. శుక్రవారం తోపుడు బండ్లు ఫ్రూట్స్, కొబ్బరికాయలు వ్యాపారాలు చేస్తున్న వారితో తుని పట్టణ మున్సిపాలిటీ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రోడ్లకు ఇరువైపులా వ్యాపారాల సాగిస్తున్న, తోపుడు బండ్లపై వ్యాపారాలు సాగి స్తున్న వారు పదార్థాలన్నీ రోడ్లపైనే పడేస్తున్నారని దీనివల్ల బాటసారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రధానంగా గొల్ల అప్పారావు సెంటర్, మార్కెట్ యార్డు రోడ్డు ఆసుపత్రికి ఇరువైపులా ఉన్న రోడ్లు పరిశుభ్రత పాటించాలని అన్నారు. పారిశుధ్య కార్మికులు శుభ్రపరిచిన గంట లోనే మళ్లీ రోడ్లన్నీ అధ్వానంగా తయారు చేస్తున్నారని, పైన వ్యర్థాలను వేసిన చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. తుని పట్టణంలో పందులు, ఆవుల పెంపకం దారులకు వారికి ఇప్పటికే నోటీసులు ఇచ్చామ న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, తుని పట్టణ ఎస్ఐ సిహెచ్ .గోపాలకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు

ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



కరప సెంటర్ లేఔట్‌ని పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్

- జగనన్న కాలనీ సెంట్రల్ లే ఔట్‌లో ఒక్క పునాది పడలేదు
- ముంపు, రోడ్డు, నీరు వంటి కనీస సౌకర్యాలు లేవు
- సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కరప

కరప మండల ప్రజలకు మండల హెడ్ క్వార్టర్‌లో సెంట్రల్ లేఔట్‌లో జగనన్న ఇళ్ల స్థలాలు లబ్ధిదారులకు ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం సిపిఎం బందం కరప కోరిపల్లి గ్రామాల్లో పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఇప్పటివరకు ఒక్క పునాది కూడా నిర్మించుకోలేక పోయారని.. దీనికి కారణం లే ఔట్ ముంపు ప్రాంతంలో ఉండడం వల్లనే అన 135 ఎకరాలలో సెంట్రల్ లే ఔట్ 3 వేల పైబడి స్థలాలు ఇచ్చినా ఇప్పటివరకు స్థలాన్ని మెరక చేయలేదన్నారు. దీనివలన చినికు పడితే మొత్తం ముంపు గురయ్యే ప్రమాదం ఉండడం వలన లబ్ధిదారులు ముందుకు రావడం లేదని, పెరిగిన గృహ నిర్మాణ సమాగ్రి ధరలు పెరగడం వలన పునాదులకే రూ.3లక్షలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని రాజశేఖర్ తెలిపారు. ప్రభుత్వం బాధ్యత తీసుకుని గృహాలు నిర్మించి ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తుందని తెలిపారు. కొరిపల్లిలో 2.24 స్థలంలో ఏర్పాటుచేసిన జగనన్న కాలనీ లో మురుగు నీరు పోయే మార్గం లేదని, వీధి లైట్స్ లేక పాముల భయంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రాష్ట్రమంతట సిపిఎం జగనన్న కాలనీలు సమస్యలపై సర్వే నిర్వహించి ప్రభుత్వం గృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఇప్పటికే గత జులై నెలలో ఒకసారి ధర్నాలు నిర్వహించి కలెక్టర్ దృష్టికి సమస్యలు తీసుకు వెళ్లామన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే లబ్ధిదారులతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని రాజశేఖర్ హెచ్చరించారు.

మోసం చేసి భూమిని అమ్మిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష

ప్రజాశక్తి - కోటనందూరు

మోసపూరితంగా భూమిని అమ్మిన వ్యక్తికి తుని పట్టణం ఏ జె ఎఫ్ సి ఎం మే జిస్ట్రేట్ ఒక సంవత్సరం జైలు శిక్ష పదివేల రూపాయలు నగదు జరిమానా విధిస్తూ శుక్రవారంనాడు తీర్పును చెప్పినట్టు ఎస్ఐ స్వామి నాయుడు తెలిపారు. జగన్నాధపురం గ్రామానికి చెందిన గొర్ల వెంకటరమణ 2016లో 2.90 ఎకరాల భూమిని నాతవరం మండలం ఎంబి పట్నం గ్రామానికి చెందిన గాడి శివ వెంకట రమణమూర్తికి 14.70,000 విక్రయించాడు. ఆ భూమిని తనకు మోసపూరితంగా అమ్మారని గాడి శివ వెంకటరమణమూర్తి ఫిర్యాదు మేరకు 2016 అప్పటి ఎస్ ఐ బి .శంకర్రావు కేసు నమోదు చేశారన్నార శుక్రవారం ఏ పీ పీ ఎన్ .సునీత వాదనలను విన్న తుని ఏజేఎఫ్ సీఎం మేజిస్ట్రేట్ తీర్పును వెల్లడించారు. కోర్టుకు సాక్షులను సకాలంలో దర్యాప్తులకు సహకరించిన తుని రూరల్ సీఐ ఏ ,సన్యాసిరావు, కోటనందూరు ఎస్ఐ పివిసి స్వామినాయుండును, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరావు జిల్లా ఎస్పి ఎంరవీంద్రనాథ్ అభినందించారు.

ముఖ హాజరు తప్పనిసరి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఉభయగోదావరి జిల్లాలో దేవదాయ శాఖ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ముఖ హాజరు తప్పనిసరిగా వేయాలని దేవదాయ ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు తెలిపారు. శుక్రవారం ఆయన వివిధ జిల్లా అధికారులతోనూ, ఈవోలతోనూ, అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి హెడ్ క్వార్టర్‌లోనే హాజరు వేసేలా చూసుకోవాలన్నారు. ఇబ్బందులు వస్తున్న వాటిని త్వరలోనే సరిదిద్దతామన్నారు. కార్యక్రమంలో డిఇఒ పులి నారాయణ మూర్తి, ఇన్‌స్పెక్టర్ ఫణి పాల్గొన్నారు

రత్నగిరిపై విద్యుత్ నామం పునరుద్ధరణ

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం దేవస్థానం రత్నగిరి కొండపైన అప్పటి అధికారులు పాలకుల అల సత్వంతో గత 18 సంవత్సరాలుగా, కనీసం రిపేర్లు కూడా నోచుకోని నిలిచిపోయిన విద్యుత్ నామాన్ని భక్తుల సౌకర్యార్థం పునరుద్ధరణ చేశారు. నాడు అధికారులు దేవస్థానం నిధులతో నియాన్ లైట్లతో విద్యుత్ నామాన్ని ఏర్పాటు చేశారు. దాతలను సంప్రదించి వారి సహకారంతో అధునాతనంగా ఉండే నాణ్యత కలిగిన ఎల్.ఈ.డి లైట్లతో కూడిన విద్యుత్ నామాన్ని రత్నగిరి కొండపైన న్యూసెంటినరీ సత్రంపైన ఈ శుక్రవారం రాత్రి ప్రతిష్టించారు. ఈ విద్యుత్ నామం పునరుద్ధరణకు ముందుకు వచ్చిన దాతలు విజయవాడకు చెందిన కుమార్, ఇంజనీర్లు, పట్టాభిరామన్, అమరేంద్రలకు దేవస్థానం అధికారులు మురళీ కృష్ణ, టి.సూర్యనారాయన్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - కాకినాడ

వాహనదారుల భద్రత, ప్రయాణికుల క్షేమమే ధ్యేయంగా రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నారని, ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎంపి వంగాగీత తెలిపారు. 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కాకినాడ పట్టణం డీ- కన్వెన్షన్ హాలులో రావాణ, పోలీస్ శాఖల అధికారులు కాకినాడ పట్టణం, గ్రామీణ ఆటో డ్రైవర్లకు నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఎంపీ వంగాగీత, ఎంఎల్ఎలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, కుడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న జిల్లా రవాణా, పోలీస్ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎంపీ వంగాగీత మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాహనదారుల భద్రత, ప్రయాణికుల క్షేమమే ధ్యేయంగా ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ఆటో డ్రైవర్లకు కూడా ఈఎస్ఐ పథకం వర్తించే విధంగా తన వంతు కషి చేస్తున్నాన్నారు. ఆటో డ్రైవర్ల అందరూ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారేనని వారందరి పైనా తమ కుటుంబాల ఆధారపడి ఉన్న విషయాన్ని గుర్తించి వాహనాలు నడపాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆటో డ్రైవర్ల యూనియన్ల విజ్ఞప్తి మేరకు త్వరలోనే ఆటో యూనియన్ అసోసియేషన్ భవనం ఏర్పాటు చేస్తామని చంద్రశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎంఎల్ఎ కురసాల కన్నబాబు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లపై గురుతర బాధ్యత ఉందని గ్రహించి ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. చాలామంది తల్లిదండ్రులు తమ బిడ్డలను పాఠశాలలు తీసుకెళ్లె బాధ్యతను ఆటో డ్రైవర్లకే అప్పగిస్తున్నారన్నారు. మద్యం, ఇతర మత్తు పదార్థాలను సేవించి వాహనాలను నడపడం ద్వారానే ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ఆటో డ్రైవర్లు కషి చేయాలని కోరారు. అనంతరం జిల్లా రోడ్డు రవాణ, పోలీస్, అపోలో ఆసుపత్రి వైద్యుల బందం ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన కొన్ని రోడ్డు ప్రమాద సంఘటన దశ్యాలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఎ.మోహన్, ఆర్టీవో పీవి. సాయిప్రసాద్, కాకినాడ ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, అపోలో ఆస్పత్రి వైద్యులు ఇతర అధికారులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సు ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



బాధితులకు ప్రమాద బీమా రూ. 20 లక్షల చెక్కు అందిస్తున్న బ్యాంక్ అధికారులు

రూ.20 లక్షల ప్రమాద బీమా అందజేత

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రమాదవశాత్తు కుటుంబానికి జీవనాధారమైన వ్యక్తిని కోల్పోయిన ఒక నిరుపేద కుటుంబానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాళ్లరేవు శాఖ ఆసరాగా నిలిచింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అకౌంట్ కలిగి పర్సనల్ యాక్సి డెంటల్ బీమా ద్వారా రూ. 1000 చెల్లించిన దానికి రూ. 20 లక్షలు ప్రమాద బీమా అందించింది. తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ బొడ్డువానిలంక గ్రామానికి చెందిన జిత్తుగ పెద అప్పారావు (46) 2022 నవంబర్ 15వ తేదీన రోడ్డు ప్రమా దంలో మతి చెందాడు. అంతకుముందు స్టేట్ బ్యాంకులో పర్సనల్ యాక్సి డెంటల్ బీమా పథకంలో భాగంగా వెయ్యి రూపాయలు బీమా చేశారు. ప్రమాదవశాత్తు కుటుంబ యజమానిని కోల్పోయిన అతని భార్య జిత్తుగ సత్యవేణికి స్టేట్ బ్యాంక్ అధికారులు శుక్రవారం రూ.20 లక్షలు ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంకులో తాళ్ళరేవు శాఖ మేనేజర్ పి. సూజన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పలు స్కీముల గురించి వివరించారు. దీంతోపాటు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ పథకాల ద్వారా అతనికి మరో రూ.4 లక్షలు ఆ కుటుంబానికి రానుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ అమలాపురం ఎస్.గుణేశ్వరరావు ఆర్‌బిఓ. కె.కష్ణమోహన్, ఎస్బిఐ అధికారులు కష్ణ బాలాజీ, యానిమేటర్లు ఈశ్వరి బాయి తదితరులు పాల్గొన్నారు.

'కోట'కు మూడు డ్రోన్ యంత్రాలు మంజూరు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

రసాయన ఎరువులు పంటలపై నేరుగా పిచికారీ చేయుటకు వినియోగిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15 లక్షలు మూడు డ్రోన్ యంత్రాలు మంజూ రైనట్లు సామర్లకోట మండల వ్యయసాయాదికారి ఇమ్మిడిశెట్టి సత్య చెప్పారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో మూడు గ్రూపులకు 40 శాతం సబ్సిడీపై మంజూరు అవ్వనున్నట్లు చెప్పారు. మండల పరిధిలో 8600 మంది రైతులు ఉండగా, ఇప్పటి వరకూ ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదు అయి 5300 మంది రైతులు ఉన్నట్లు చెప్పారు. అలాగే వారంతా ఆన్‌లైన్ లో తంబు నమోదు వేయించుకున్నట్లు చెప్పారు. మండల పరిధిలోని ఆర్‌బికేలలో ప్రస్తుతం మూరియా 180 మెట్రిక్ టన్నులు, డిఎపి 120 మెట్రిక్ టన్నులు, పోటాషియం 20 మెట్రిక్ టన్నులు నిల్వలు ఉన్నట్లు వివరించారు.

పథకాల శకటాలను ప్రదర్శించాలి

-గణతంత్ర దినోత్సవ వేడుకలపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - కాకినాడ

74వ భారత గణతంత్రదినోత్సవ వేడుకలలో ప్రభుత్వ శాఖల ద్వారా అమలవు తున్న పథాకాల సమాచారంతో ఆకర్షణీయమైన శకటాలను ప్రదర్శించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కోర్టు హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 26వ తేదీన స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జిల్లా స్థాయి భారత గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు చేపట్ట వలసిన ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.


అన్ని ప్రధాన శాఖలు తమ అభివద్ధిసంక్షేమ కార్యక్రమాల సమాచారంతో శకటాలు లేదా స్టాళ్లను ఏర్పాటు చేయాని ఆదేశించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రసంశా పత్రాలు అందించేందుకు ఆయా శాఖల ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని జిల్లా అధికారులకు సూచించారు. పోలీస్ పెరేడ్ మైదానం, వేదికల సందరీకరణపై సూచనలు జారీ చేసి, వేడుకలలో నిర్వహించే సాంస్కతిక కార్యక్రమాల ఎంపికను పరిశీలించారు. అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేయాలని, అవసరమైన జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని ట్రాన్స్కో అధికారులు, మైదానంలో పరిశుభ్రత, తాగునీటి సరఫరా ఏర్పాట్లు చేపట్టలాని జిల్లా పంచాయతీ అధికారికి సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి అత్యవసర, ప్రథమ చికిత్సా సేవలను అందుబాటులో ఉంచాలని సూచిం చారు. అన్ని శాఖలు సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలాక్కియా, డిఆర్ఓ కె.శ్రీధరరెడ్డి, ఎఎస్‌పి బి.సత్యనారాయణ, జడ్‌పి సిఈఓ ఎన్ వివి సత్యనారాయణ, కాకినాడ ఆర్‌డిఒ బి.వి.రమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా శ్రీనివాస్ ఏకగ్రీవం

ప్రజాశక్తి- కాకినాడ కార్పొరేషన్

ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాకినాడకు చెందిన పసుపులేటి శ్రీనివాస్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఏపీ ఎన్‌జిఒ సంఘం తెలిపింది. ఈ సందర్భంగా శుక్రవారం కాకినాడ ఎంఎల్‌ఎ మర్యాద పూర్వకంగా కలిసిన ఏపీ ఎన్‌జిఒ నాయకుల ఆధ్వర్యంలో శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ బ్రదర్ ఎన్ని రోజులుగా ఏపీ ఎన్జీవో నాయకులు సీఎం జగన్ మోహన్ రెడ్డితో పాటుగా పలువురు మంత్రులను కలవడం జరిగిందని, ఉద్యోగుల సమస్య లను త్వరలోనే పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జిఒ జిల్లా కార్యదర్శి పేపకాయల కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తి బాబు, ట్రెజరర్ లక్ష్మీ ప్రసన్న, సరేల చంద్రరావు, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి- కాజులూరు

సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. గురు వారం మండలంలోని అంద్రంగిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్ర మంలో మంత్రి వేణు గోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో పే లక్ష్యంగా పనిచేస్తుందని దీనిలో భాగంగా ప్రతి ఇంటికి అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. జగనన్న కాలనీలో 360 మంది లబ్ధిదారులకు సంబంధించి విద్యుత్ సరఫరా ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు వనుము వెంకట సుబ్బారావు ఎంపీపీ మాత భారతి మురళి వైస్ ఎంపీపీ పెద్దిరెడ్డి వెంకటరమణ, విజయ్ ఫణీంద్ర, సహకార సంఘం అధ్యక్షులు సోమన్న స్థానిక నాయకులు కేసన వీర్రాజు సలాది నానాజీ యాళ్ల సత్తిబాబు పలు శాఖల అధికారులు పలు గ్రామాల సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పెన్షనర్ల ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కాకినాడ

గ్రంథాలయ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర గ్రంథాలయ పింఛనుదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిమల్లేశ్వరరావు కోరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆయన సమక్షంలో ఏర్పాటు చేసుకున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సమావేశం శుక్రవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ పింఛను దారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాకినాడలోని జిల్లా గ్రంథాలయ సంస్థ హాలులో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మల్లేశ్వరరావు హాజరయ్యారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్య క్షులుగా జి రామారావు, అధ్యక్షుడిగా ఎం.సంజయ్‌శ్రీ, ఉపాధ్యక్షుడిగా ఎన్ రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా సలాది సాయి సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా పి.పాపారావు, కోశాధికారిగా వీజీ రామారావు, ప్రచార కార్యదర్శిగా గట్టి వెంకట్రావు, సలహాదారుగా సిహెచ్ నాగేశ్వరరావుతో పాటు కార్యవర్గ సభ్యులుగా డి.వాణిశ్రీ, కే శివరావు, ఆర్ వీరభద్రరావు, వి.లక్ష్మయ్య, ఎం రాంబ్రహ్మంలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ గతంలో మాదిరిగానే 915 జీవో ప్రకారం వేతనాల ద్వారా పెన్షన్ చెల్లించాలని, రాష్ట్రవ్యాప్తంగా బకాయి పడిన సెస్ సుమారు రూ.400 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఎరియర్స్ గ్రాంట్ సుమారు రూ.100 కోట్లు ప్రభుత్వం విడుదల చేయాలని మల్లేశ్వరరావు కోరారు.

సమైక్యతతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఫోటోగ్రాఫర్ లందరూ కలిసికట్టుగా ఉన్నప్పుడే వృత్తి పరమైన సమస్యలు పరి ష్కారం అవుతాయని ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తోట చంటిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక వరహాలయ్య పేటలోని యాసలకాపు సూర్యారావు భవనంలో జరిగిన జిల్లాస్థాయి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పెద్దాపురం పట్టణం నుండి జిల్లా నిర్వహణా కార్యదర్శి దేశపల్లి వరహాల రాజును, జిల్లా కార్యవర్గ సభ్యులుగా బిక్కిన శ్రీనులను ఎన్నుకుని వారితో ప్రమాణం చేయించారు. తొలుత కెమెరా సష్టికర్త లూయిస్ దాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు, కార్యదర్శి సయ్యద్ కమ్రు, రమణ,రెడ్డి, భద్ర రావు, బళ్ళ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బిసి సాధికార సగర కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - కాకినాడ

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చియనాయుడు ఆదేశాలతో పార్టీ జిల్లా బిసి సాధికార సగర కమిటీ సభ్యుల జాబితాను కాకినాడ జిల్లా పార్లమెంటు అధ్యక్షుడు జ్యోతుల నవీన్ విడుదల చేశారు. జిల్లా టిడిపి కార్యాల యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో జాబితాను విడుదల చేస్తూ కమిటీ కన్వీనర్‌గా గుర్రం సుబ్బారావు, సభ్యులుగా నంగన శ్రీనివాస్, జక్కి అప్పారావు, ద్రోనాద్రి అబ్రహం తదితరులను నియమించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ తమపై నమ్మకంతో అధ్యక్షులు తనకు తమ సగరులకు పార్టీ లో ఉన్నత స్థానం కల్పించారని, . టిడిపి అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.





యుద్ధ విమానం నుంచి పారా ట్రూపర్ల విన్యాసం తిలకిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, జెసి ఇలక్కియా..









ఆయుధ ప్రయోగాన్ని వివరిస్తున్న సైనికాధికారులు ...... జలభూమార్గాలపై ఆంఫిబియాస్ విన్యాసాలు

సాగర తీరంలో... సైనిక విన్యాసాలు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

సాగరతీరంలో సైనిక విన్యాసాలు యుద్ధభూమిని తలపించాయి. అరుదైన సైనిక విన్యాసాలకు కాకినాడ సాగర తీరం శుక్రవారం సాయంత్రం వేదిక అయింది. భారత నౌకాదళం, ఆర్మీ సంయుక్తంగా ఆంఫిబియాస్ పేరుతో కాకినాడ గ్రామీణ మండలం, సూర్యారావుపేట నావల్ ఎన్ క్లేవ్ వద్ద సముద్ర తీరంలో సైనిక విన్యాసాలను చేపట్టారు. త్రివిధ దళాలకు చెందిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాకినాడ సముద్ర తీరాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. ఈ విన్యాసాలను కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ తదితరులతో కలిసి తిలకించారు. తీరంలో యుద్ధం, తుపాను, విపత్తు, ఆపద సందర్భాల్లో సముద్రం, ఆకాశమార్గం నుంచి ఎలా సహాయ కార్యక్రమాలు చేపడతారో వంటి విషయాలను త్రివిధ దళాల అధికారులు.. జిల్లా కలెక్టర్, జేసీ ఇతర అధికారులకు వివరించారు. వెపన్స్ పనితీరు, యుద్ధ ట్యాంకులు, నౌకలు, పారా ట్రూపర్స్, హెలికాప్టర్ విన్యాసాలను కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియా, అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ ఈ సందర్భంగా తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ తీరంలో ట్రైగర్ ట్రయాంఫ్ పేరిట భారత్-అమెరికా త్రివిధ దళాలు నిర్వహిస్తున్న విన్యాసాలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన భద్రత, ఇతర సహకారం అభినందనీయం అని దగ్గదని నేవీ రియర్ అడ్మిరల్ సూరజ్ బెరీ కొనియాడారు. భీకర యుద్ధాలు, సునామీ లాంటి ప్రకృతి వైపరీత్యాలు, సంభవించినపుడు వాటిని ఎలా ఎదుర్కోవాలి, క్షతగాత్రులకు అందించాల్సిన సేవలపై విన్యాసాలు కొనసాగుతున్నాయన్నారు. భారత నౌకాదళం, ఆర్మీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ విన్యాసాలు ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు జరుగుతాయని సైనికాధికారులు వెల్లడించారు.

కానిస్టేబుల్ రాత పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లాలో పోలీస్ కానిస్టేబుల్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఎస్పి ఎం.రవీంద్రనాథ్ బాబు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 59 పరీక్ష కేంద్రాలలో మొత్తం 30,272 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఈ నెల 22 ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రాథమిక రాత పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులను ఉదయం 9 గంటల నుండి పరీక్షా హాల్లోకి అనుమతిస్తారని, నిర్దేశిత సమయానికన్నా ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని అభ్యర్థులు తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలన్నారు. పరీక్షా సమయానికి అనగా ఉదయం 10.00 గం. తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోనికి పరీక్షార్థులను అనుమతించరన్నారు. పరీక్ష రాసేందుకు వచ్చిన ప్రతి ఒక్క అభ్యర్థిని పూర్తిగా తనిఖీ చేసిన అనంతరం మాత్రమే పరీక్ష హాల్లోకి అనుమతి స్తారన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్టుతో పాటు ఒక ఫోటో, గుర్తింపు కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నులు మాత్రమే తీసుకురావా లన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సంబంధిత శాఖల నిర్వాహకులతో మొబైల్ కౌంటర్, బ్యాగేజ్ కౌంటర్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఏ విధమైన ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష హాల్‌లోకి అనుమతించబడవన్నారు. పరీక్ష రాసిన తర్వాత పరీక్ష సమయం ముగిసిన తర్వాత మాత్రమే బయటకు పంపుతారని, పరీక్షలకు సంబంధించి ఏ విధమైన అవకతవకలకు పాల్పడిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం ఆర్‌టిసి ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయా ప్రాంతాలనుండి బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ సౌకర్యాన్ని అభ్యర్థులు వినియోగించుకోవాలన్నారు. మహిళా అభ్యర్థులను తనిఖీ చేయడానికి మహిళా పోలీస్ సిబ్బందిని అందుబాటులో ఉంటార న్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణకు తగిన భద్రతా పరమైన చర్యలు, తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ నిర్దేశాల ప్రకారం పరీక్ష కేంద్రాలలోనికి అభ్యర్థులు, పరీక్షల నిర్వహణ సిబ్బందిని మాత్రమే అనుమతిస్తున్నట్టు తెలిపారు. ఈ విషయం అందరూ గ్రహించి సహకరించవలసిందిగా కోరారు.

నవోదయలో ప్రవేశ పరీక్షలకు ఆహ్వానం

ప్రజాశక్తి - కోటనందూరు

జవహర్ నవోదయ విద్యాలయంలో 2023 - 24 ప్రవేశ పరీక్షలకు 31.1.2023 దరఖాస్తు చేసుకునే చివరి తేదీ అని ఎంఇఒ శ్రీనివాసరావు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక నవోదయ విద్యాలయానికి చెందిన వడ్లబండ ఓదెలు, వి .శ్యామ్ కుమార్ విద్యాలయ బందం, ఎంఇఒ ఏ శ్రీనివాసరావు, స్థానిక వైస్ ఎంపీపీ బండుపల్లి గంగాధర్ శుక్రవారం కాకరాపల్లి, కోటనందూరు, డి.పోలవరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నవోదయ ప్రవేశ పరీక్ష ఏ విధంగా రాయాలని అంశాలపై అవగాహన కల్పించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రంపచోడవరం ,మారేడుమిల్లి, దేవీపట్నం, గంగవరం, వి .రాయవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, గోకవరం, ఏలేశ్వరం, కోరుకొండ, వి.ఆర్,పురం, తుని, తొండంగి, కోటనందూరు, ప్రత్తిపాడు, శంఖవరం రౌతులపూడి, ఎటపాక, కూనవరం, సీతానగరం చింతూరు, మండలాల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడం అర్హులని తెలిపారు. ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే పరీక్షల అర్హులని తెలిపారు. www.navodaya.gov.in వెబ్సైట్ కు ఈ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

23న వికాస కార్యాలయంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడలోగల వికాస కార్యాలయంలో ఈ నెల 23వ తేదీ సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పిడి లచ్చారావు ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో 9 కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. యాక్సిస్ బ్యాంకులో రిలేషన్స్ ఆఫీసర్, సెవెన్ స్టార్ హాస్పటల్ లో స్టాఫ్ నర్స్, ఒ.పి సర్వీస్, ల్యాబ్ టెక్నిషియన్, ఫ్రంట్ డెస్క్ ఆఫీసర్, హెూండాయ్ మోబీస్లో టెక్నిషియన్, హీల్ మై ఫ్యామిలీ హెల్త్ కేర్ సర్వీసెస్లో కేర్ టేకర్స్, హెల్ప్ యువర్ నీడ్స్, కామ్లో బిజినెస్ ఎగ్జిక్యూటివ్, నిట్ (ఐసిఐసిఐ బ్యాంక్లో లేషన్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ(ప్రొడక్షన్), ఇండిగో ఎయిర్లైన్స్లో లోడర్, డ్రైవర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తరాన్నారు. అలాగే డియుజికెపై స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించడం జరుగుతుందన్నారు. పై ఉద్యోగాలకు ఎస్.ఎస్.సి నుండి పి.జి వరకు ఉత్తీర్ణులైన 40 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హుల న్నారు. వీరికి నెలకు రూ.10,000 ల నుండి రూ. 20,000లు వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ 23వ తేదీ సోమవారం కాకినాడ కలెక్టరేట్ ప్రాంగణంలో గల వికాస కార్యాలయం, వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జెరాక్స్ లతో హాజరుకావలన్నారు. మరిన్ని వివరాలకు 8297400666, www.vikasajobs.com సంప్రదించాలని సూచిం చారు.

22న ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

కాకినాడ పిఆర్ ప్రభుత్వ కళాశాల ఇండోర్ స్టేడియంలో ఈనెల 22వ తేదీ ఆదివారం మధ్యాహ్నం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కబడ్డి జట్లను ఎంపిక చేస్తున్నట్లుట తూర్పుగోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు విశాఖ జిల్లా అనకాపల్లి మండలం అంకుంపాలెంలో 70వ అంతర్ జిల్లాల పురుషులు, స్త్రీల కబడ్డీ పోటీలు జరుగుతున్నట్టు తెలిపారు. దానిలో తూర్పుగోదావరి జిల్లా నుంచి పురుషులు, స్త్రీల జిల్లా టీం లను ఎంపిక చేస్తున్నట్టు తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు పురుషులు 85 కిలోల లోపు బరువు, స్త్రీలు 75 కిలోల లోపు బరువు ఉండాలన్నారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులంతా విధిగా షఉ ధరించి హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 9642049777, 8008566930, 9491191101 నంబర్లలో సంప్రదించాలని అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

22న కెరీర్ గైడెన్స్ విద్యార్థులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

విద్యార్థి దశలోనే వారిలో దాగున్న ప్రతిభా పాటవాలు వెలికితీసి, ఆయా రంగాల్లో వారికి ఉన్న అవకాశాలను తెలియజెప్పేందుకు ఈనెల 22న ఆదివారం ఉదయం 10గంటల నుంచి దంటు కళాక్షేత్రంలో ఉచితంగా కెరీర్ గైడెన్స్ కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు ప్రముఖ సైకాలజిస్టు జి.శశిభూషణ్ తెలిపారు. శుక్రవారం కరణంగారి సెంటర్ వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో శశిభూషణ్ మాట్లాడుతూ ఈకార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఉదయం కౌన్సిలింగ్ అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తత్వం, స్కిట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమానికి ఎన్‌సిసి గ్రూప్ కమాండర్. కల్నల్ ఎకే.రిషి హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ స్ఫూర్తి సమితి ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కార్యవర్గసభ్యుడు జి. ఉదయ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

మన మున్సిపాలిటీ- మన బాధ్యత

ప్రజాశక్తి - కోటనందూరు

తుని మునిసిపాలిటీ పరిధిలో 25వ వార్డు వీరార పేటలో మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యులు ఏలూరి సదా బాలు ఆధ్వర్యంలో శుక్రవారం మన మున్సిపాలిటీ మన బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలను వింటూ పరిష్కారానికి అధికారులకు ఆదేశిస్తూ ముందుకు సాగుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని పారిశుధ్యని పరిరక్షించాలని ప్రజలు ఆయనకు విన్నవించుకున్నారు. సమస్యలను రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాకు దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

మడఅడవుల సంరక్షణ అందరి బాధ్యత

కోరంగిలో పలు అంశాలపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జర్నలిస్టులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి- తాళరేవు

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రకతి విపత్తులు రాకుండా రక్షణ కవచం లా ఉన్న మడఅడవుల సంరక్షణ మనందరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్ర వారం .ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ, జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో మడ అడవుల సంరక్షణ, సామాజిక బాధ్యత-మీడియా పాత్రతో పాటు జర్నలిజం మౌలిక సూత్రాలు, విలువలు అంశాలపై కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విలువలతో కూడిన జర్నలిజం అలవర్చుకోవాలన్నారు. కొన్ని పత్రిక యాజమాన్యాలు జర్నలిజం మౌలిక సూత్రాలు విస్మరిస్తు న్నాయని అన్నారు. మడఅడవుల సంరక్షణ పట్ల అటవీశాఖ బాధ్యతతో పాటు మీడియా ప్రముఖ పాత్ర వహించాలన్నారు. సమస్త ప్రాణికోటి మనుగడకు మూలాధారమైన ప్రకతి సంపద పరిరక్షణలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, సామాజికవేత్తలు రాయుడు గంగాధర్, కేసరి శ్రీనివాసరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, కుడుపూడి శివన్నారాయణ, మాజీ జడ్పీ చైర్మన్ దున్న జనార్దన్ రావు మాట్లాడుతూ తీర ప్రాంతాలను ఆనుకుని ఉన్న ప్రజలు మడా అడవులను నరకకుండా అవి ఏరకంగా ఉపయోగపడుతు న్నాయో ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులను విద్యా, వినోద యాత్రలో భాగంగా మడఅడవులు సందర్శించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని సలహా ఇచ్చారు. అవగాహన సదస్సులో పాల్గొన్న కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు పత్రికా విలువలపై మాట్లాడే సందర్భంలో పలు యూట్యూబ్ ఛానల్ల పైన, పిడిఎఫ్ పత్రికల పట్ల, ప్రచురించే వార్తల పట్ల జర్నలిస్టులకు పలు సూచనలు చేశారు. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్, జిల్లా అటవీశాఖ అధికారి ఇందుకూరి కాశీవిశ్వనాథ రాజు, ఫారెస్ట్ రేంజర్ ఎస్ ఎస్ ఆర్ వరప్రసాద్, సత్య నారాయణ, ఎంపీపీ రాయుడు సునీత, ఐ.పోలవరం జడ్‌పిటిసి ముదునూరి సతీష్ రాజు, వైసిపి రాష్ట్ర కార్యదర్శులు కార్యదర్శులులు దున్న జనార్దన్ రావు, కుడుపూడి శివన్నారాయణ, చిట్టి రాజు, మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, కోరంగి సర్పంచ్ పెయ్యలమంగేష్, ఉంగరాల వెంకటేశ్వరరావు, పెయ్యల చిట్టిబాబు, పి రాజ గోపాల రాజు, సీనియర్ పాత్రికేయులు సీతారామరాజు, శాస్త్రవేత్త మహేష్, ఫారెస్ట్ ఎఫ్ ఎస్ ఓ.లు, ఎఫ్ బి ఓ లు పాల్గొన్నారు.





సదస్సులో మాట్లాడుతున్న ఏపి ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని,...... కొమ్మినేనికి వినతి పత్రం అందిస్తున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జర్నలిస్టులు

విదేశాలను తలపించేలా కోరంగి అడవులు

విదేశాలను తలపించేలా అంతర్జాతీయ ఖ్యాతితో కోరంగి మడ అడవులు మరింత అందాన్ని సంతరించుకున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. మడ అడవుల సంరక్షణపై జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో భాగంగా ముందుగా కోరంగి అభయారణ్యాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చొల్లంగి పర్యాటక కేంద్రంలో తుల్యభాగ డ్రైన్ పై ఆయన బోట్ షికారు చేశారు. చెక్కల వంతెన పై నడిచి చొల్లంగి పర్యాటక కేంద్రంలోని వక్ష జాతుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోరంగి అభయారణ్యం పర్యాటకులకు అనువైన ప్రాంతమని, ఈ ప్రాంతాన్ని బయట ప్రపంచానికి తెలియజేయడానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మరింత కృషి చేయాలని తెలిపారు.. ఆయన వెంట ప్రెస్ అకాడమీ కార్యదర్శి బాలగంగాధర్ తిలక్, డిఎఫ్ఒ. ఐ.కె.వి. రాజు, కోరంగి ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్. వరప్రసాద్, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు, తహశీల్దార్ ఏస్.పోతురాజు, ఎంపిడిఒ ఎం.అనుపమ, ఫారెస్ట్ బీట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై వినతి

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు పట్ల ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జర్నలిజం సంఘాలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) కాకినాడ జిల్లా కార్యదర్శి గుత్తుల మల్లేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ నాయకులు మాట్లాడారు. అక్రిడిటేషన్ కమిటీలను పునరుద్ధరించి, అక్రిడిటేషన్లు సకాలంలో ఇవ్వాలన్నారు. పత్రికా, మీడియా జర్నలిస్టులపై విధించిన వత్తి పను రద్దు చేయాలని, వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చి హౌసింగ్ రుణాలు మంజూరు చేయాలన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలపై తీసుకొచ్చిన జీవో నెంబర్ 142 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అక్రిడిటేషన్ తో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్టులందరికీ మెడిక్లయిమ్, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ అంశాలపై ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించడానికి కషి చేస్తానని ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరావు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నవీన్ రాజు, శివారెడ్డి, దురాని, రాజు, చిన్నారావు, సతీష్, సాంబ, రమణ, ఆనంద్, పి. శ్రీనివాస్, గంగా ప్రసాద్, శ్రీనివాస్(జె.డి.), ఈశ్వర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం

జెవివి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో విద్యార్థులు సత్తాచాటి రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ఎంపికయ్యారు. వీరంతా శుక్రవారం కడప బయలు దేరారు. ఆత్రేయపురం మండలం ర్యాలి ఉన్నత పాఠశాల జట్టుకు, అమలాపురం టౌన్ ఎస్‌పిఆర్ఎంబ్లు స్కూల్ జట్టుకు, ర్యాలి జట్టుతో వెళుతున్న ఉపాధ్యాయులు జాలెం రూపస్‌రావు, అమలాపురం జట్టుతో వెళుతున్న ఉపాధ్యాయులు పి.సుబ్రహ్మణ్యం, విద్యార్థిని తల్లి లక్ష్మికి జిల్లా జెవివి ప్రధాన కార్యదర్శి కెవివి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

సచివాలయ సేవలు త్వరితగతిన అందజేయాలి

ప్రజాశక్తి -తాళ్లపూడి

ప్రజలకు సచివాలయాల ద్వారా అందిస్తున్న అన్ని రకాల సేవలు సక్రమంగా త్వరితగతిన అందజేయాలని కొవ్వూరు డిఎల్‌డిఒ శాంతామణి ఆదేశించారు. శుక్రవారం మండలానికి వచ్చిన ఆమె ఎంపిడిఒ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. శాంతా మణి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో వెనకబడ్డ మండలాల్లో తాళ్లపూడి మండలం కింద స్థాయిలో ఉందని, స్పందనతో పాటు డయల్ సిఎం సార్ కార్య క్రమంలో వచ్చిన ఫిర్యాదులు సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో మండల పరిషత్ పర్యవేక్షణ అధికారి రామారావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ కవి యోగి వేమన

ప్రజాశక్తి- రావులపాలెం

సామాజిక స్పృహతో ప్రజల కోసం ప్రజల భాషలో అక్షరాలు సంధించిన అభ్యుదయ కవి వేమన అని అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి దుళ్ల వెంకటే శ్వర్లు అన్నారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా సంస్థ, రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో వేమన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు విశ్వకవి వేమన పై పద్య పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతీ ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ వేణుగోపాల కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. .

సస్యరక్షణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - అంబాజీపేట

కొబ్బరి, కోకోలో జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా సస్య రక్షణ అనే అంశం పై శాస్త్రవేత్తలు డాక్టర్ వి.అనూష, జి.కోటేశ్వరరావు లు అవగాహన కల్పించారు. అంబాజీపేట ఉద్యానపరిశోధన కేంద్రం నందు అధిపతి బి.శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం ఉద్యాన తోటల సమన్వయ పథకం, షెడ్యూల్ కుల ఉప ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవ నియంత్రణ, సస్యరక్షణ, ప్రతుల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్.బి.చలపతిరావు కొబ్బరి తెగుళ్ల సంబంధించిన వివిధ అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బి.నీరజ, ఎ.కిరీటి, అంబాజీపేట, అమలాపురం ఉద్యానవన అధికారి దిలీప్, విస్తరణ సిబ్బంది, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి -దేవరపల్లి

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన చేస్తోందని గోపాలపురం ఎమ్ఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. ధుమంతునిగూడెంలో 176 రోజు గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్ఎల్ఎ పాల్గొని ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి దుర్గారావు, దేవరపల్లి జెడ్‌పిటిసి సభ్యురాలు స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న పలువురి అరెస్ట్

ప్రజాశక్తి -కడియం

బుర్రిలంక గోదావరి గట్టు సమీపంలో పేకాడుతున్న ఐదుగురిని శుక్రవారం కడియం పోలీసులు అరెస్ట్‌చేశారు. వారి వద్ద నుంచి రూ. 38,390 నగదు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు కడియం ఎస్.ఐ షేక్ అమీనాబేగం తెలిపారు.

మహిళలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-చాగల్లు

రిటైర్డ్ ఎంఇఒ మదర్ థెరిస్సా సేవాసమితి గౌరవ సలహాదారు కోడి నాగేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం సంస్థ అధ్యక్షులు పోలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదగా మహిళలకు దుస్తులను పంపిణీ చేశారు అలాగే రెండు కాళ్లు కోల్పోయిన మహిళకు రూ.2వేల సాయం అందజేశారు. శ్రీ నివాస్ ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో వికలాంగులకు ట్రస్ట్ ద్వారా 13 ఏళ్ల నుంచి సేవలందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో చాగల్లు, నెలటూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు పిచ్చుకల సత్యనారాయణ, కరుటూరి సతీష్ కోడూరి ప్రసాద్ వల్లిపల్లి వెంకటరామారావు, కోడి శ్రీను, కోడూరి రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, వైద్యసిబ్బంది

పిహెచ్‌సిలో సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట పిహెచ్‌సిలో సదుపాయాల కల్పనపై దృష్టి సారించి అభివృద్ధికి కమిటీ, వైద్యసిబ్బంది కృషి చేయాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. సమావేశంలో శుక్రవారం ఎంపిపి వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ ఐ.రత్నం రాజు మాట్లాడుతూ సోమవారం, బుధవారం, శుక్రవారం పిహెచ్‌సికి చెవి, ముక్కు, ఆర్థోపెడిక్, గర్భిణుల వైద్యనిపుణులు హాజరవుతున్నారని అన్నారు. గ్రామాల్లో ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు వి.గౌతమి, శ్రీనివాస్‌లు ఆస్పత్రిలో అందిస్తున్న సేవలను వివరించారు. పిహెచ్‌సిలో తాగునీరు అందించేందుకు పైపు లైన్లను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో యుడిసి జెటివిఎస్.ప్రసాద్, సిహెచ్‌బి.అప్పారావు, సూదాబత్తుల రాము తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- దేవరపల్లి

దేవరపల్లి గ్రామంలో శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న డ్రైనేజ్ కాలువలో గ్రామానికి చెందిన మాధవరపు త్రిమూర్తులు కాలువలో పడి ఊపిరాడక మృతిచెందాడు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.శ్రీహరి రావు తెలిపారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - ధవళేశ్వరం

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం కావడంపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి.. మతిస్థిమితం లేని నేతాజీనగర్-2 ఎర్ర కొండకు కు చెందిన శారీకణం.మహేష్ ఈ నెల 17 నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ లభించలేదు. దీనిపై అతని కుటుంబసభ్యులు ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి- ధవళేశ్వరం

అక్రమ తరలిస్తున్న బియ్యాన్ని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ధవళేశ్వరంలో రాఘవేంద్ర స్వామి గుడి వద్ద అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని అధికారులు తనిఖీ చేశారు. వాహనంలో 32 బియ్యం బస్తాలు ఉన్నాయని, అక్రమంగా బియ్యం తరలిస్తున్న వాహనాన్ని, వాహనానికి సంబంధించిన మద్దూరి హనుమంతరావు చాప వెంకన్న ఉండమట్ల వెంకట నాగేంద్రలను అరెస్ట్ చేశామని అధికారులు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేశామన్నారు. దీనిపై ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు.

మోటార్‌సైకిల్ చోరీ కేసులో ఇద్దరికి జైలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలో మోటార్ సైకిల్ ను చోరీ చేసిన కేసులో నిందితులైన పామర్రుకు చెందిన చుండ్రు రమేష్ బాబు, కాకినాడ టౌన్ చెందిన ఇసుకపాటి యేసురాజుకు నాలుగు నెలలు జైలు శిక్ష విధిస్తూ రామచంద్రపురం ఎజిఎఫ్‌సిఎం మెజిస్ట్రేట్ ఆశీర్వాద పాల్ తీర్పునిచ్చారని శుక్రవారం ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇవి.. గత ఏడాది ఫిబ్రవరి 23 న మోత సురేంద్ర శ్రీ హరి కి చెందిన మోటార్‌సైకిల్‌ను దొంగిలించారని ఫిర్యాదు మేరకు చుండ్రు రమేష్ బాబు, ఇసుకపాటి యేసురాజుపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులపై నేరము రుజువు కావడంతో నిందితులకు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు.